13079601

మనసులోనున్న భావంబు మంచిదైన
కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు
మనసులో నున్న భావంబు మలినమైన
ఫలము కూడను ఆరీతి మలినమగును.

సాధుజనుల జూచి చౌక చేతురు
వారికేమి కొదువ వసుధయందు
కుంజరమును జూచి కుక్కలెన్నొ మొరుగు
దానికేమి కొదువ ధరణియందు.

విద్యార్థులారా!

ఈనాడు యావత్ప్రపంచమందు అసూయ, అహంకారము మితి మీరి పెరిగి పోయినాయి. క్లాసులో ఎవరికైనా 1st class వస్తే వారిని చూచి మిగిలిన పిల్లలు అసూయపడుతుంటారు. ఎవరైనా పుష్టిగా సంతుష్టిగా ఉండినప్పుడు వారిని చూచి మిగిలినవారు అసూయ పడుతుంటారు. శ్రీమంతుని జూచి దరిద్రులు అనేక విధములుగా ఆహాహాలు పడుతుంటారు. అదే విధముగా పక్షులందు హంసను చూచి కొంగలు పరిహసిస్తాయి. కోకిలకూతను కాకులు కర్ణకఠోరముగా భావిస్తాయి. లోకులు కాకులు. దేనికి మనము వెరువక మన సత్యముపై ఆధారపడి జీవితమును సరియైన మార్గములో, సక్రమమైన మార్గములో నడపుకోటానికి తగిన కృషి చేయాలి. ఏనుగు తన గంభీరమైన నడకలో దేనిని లెక్క చేయక బజారున వెడుతూ ఉంటుంది. ఎన్ని కుక్కలు మొరిగినా ఏమాత్రము లెక్కచేయదు. ఏనుగు ఎక్కడ కుక్కలు ఎక్కడ? పోలికే లేదు. అదే విధముగా కోకిల ఎంతో సుస్వరయుతో గానము చేస్తుంది. కాకుల కూతలకు వెరచి కోయిల తన గానము మానుతుందా? కానీ ఈనాటి మానవలోకమందు మన మంచిని, మన అభివృద్ధిని, మన సంక్షేమమును, మన పవిత్రతను గుర్తించి అనేకమంది అసూయ పడవచ్చు. కానీ మనలో భావములు మనము పరిశుద్ధము చేసుకోవాలి గానీ ఇతరుల భావములకు ఏ విధముగాను లొంగకూడదు. కృంగకూడదు.

'మనసులో నున్న భావంబు మంచిదైన కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు'. మన

13079602

యందున్న భావములు పరిశుద్ధముగా ఉండేలా చూచుకోవాలి గాని ఇతరుల దానిని బట్టి మన భావములు ఏమాత్రము మార్చుకో కూడదు. మన భావము ఎట్టిదో ఫలితము అట్టిది. భగవంతుడు భావప్రియుడు. లోకము బాహ్య ప్రియము. బాహ్యమును చూచి లోకము హాస్యాస్పదము చేయవచ్చు. కాని భగవంతుడు భావప్రియుడు కనుక అతని యందు ఎట్టి మార్పులు కనిపించవు. సర్వత్రా ఉన్న దైవత్వము గుర్తించటానికి తగిన చిహ్నము మన భావమే. మన భావము మన చర్యలపై ఆధారపడి ఉంటున్నాయి.

చర్యలన్నీ సంకల్పములపై ఆధారపడి ఉంటున్నాయి. ప్రతి ఒక్కటి reflection of the inner being. మన నుండి ఆవిర్భవించే ప్రతిధ్వనులే బాహ్యప్రపంచమందు చూస్తున్నాం. మన భావములను పరిశుద్ధము గావించుకునే విషయములోనే కాయమును, కర్మను సద్వినియోగము చేయాలి. ఈనాడు సాధన చేస్తున్నాం. సాధన అనగా ఏమిటి? జపము చేయుటమా లేక ధ్యానము చేయుటమా లేక భజన చేయుటమా? ఇవన్నీ ప్రాకృతికమైన భక్తికి సోపానములే. నిజమైన సాధన మనయందున్న అభావము దూరము చేసుకోవాలి. అనాత్మ భావమును దూరము చేసుకోవాలి. ప్రాకృతమైన చర్యలు దూరము చేసుకోవాలి. క్షేత్రజ్ఞుని దృష్టి యందుంచుకొని క్షేత్రమును విసర్జించాలి. ప్రాకృత భావములను విసర్జించి దివ్యమైన భావములు అభివృద్ధి పరచుకొని, ఇది సరైన సాధనగా భావించి, ప్రవృత్తికి సంబంధించినవిగా విశ్వసించి మనం ప్రవేశించాలి. మనము చూచునది, వినునది తలంచునది, భ్రమించునది ఇవన్నీ ప్రకృతి లక్షణములే. వీటన్నింటి కంటె అతీతమైనదే నిజమైన భావము. అదే నివృత్తి లక్షణము. ఈ నివృత్తి లక్షణము చక్కగా గుర్తించటానికి పూనుకోవాలి. ఈ నివృత్తి లక్షణము ఎక్కడనుంచి ప్రారంభమైంది? అనేక పర్యాయములు విద్యార్థులకు చెప్పాను ఆత్మనుండి అహం ఆవిర్భవిస్తున్నది. అహం అనగా నేను. ఇది భగవంతుని మొట్టమొదటి పేరు. ప్రతి మానవుడు ప్రకృతిలో జన్మించిన తక్షణమే నేను అని పలుకుతాడు. ఈ అహం నుండే మనస్సు ఆవిర్భవిస్తుంది. ఈ మనస్సు నుండే వాక్కు ఉద్భవిస్తున్నది. కనుక అహం కు మనస్సు కుమారుని వంటివాడు వాక్కు grand son వంటివాడు. వాక్కు, మనస్సు, అహం ఒక కుటుంబమునకు చెందినవే. ఈ త్రయం లో ఒక్కటే. అదే సచ్చిదానందము. ఈ సచ్చిదానందమే మనసుకు, అహమునకు, వాక్కునకు, శరీరమునకు సంబంధించినది.

ఎక్కడ చూచినా ఉన్నది ఈ సచ్చిదానందమే. ఈ సత్ చిత్ ఆనందముతో భగవంతుని

లక్షణములు. భగవంతుడు గుణాతీతుడు. అయితే ఈ ఆనందమైన స్వరూపాలు ఎక్కడనుండి వచ్చాయి. అగ్నికి ఎఱ్ఱదనము, దహనశక్తి, వేడి ఈ మూడు ఏవిధంగా సహజమో సచ్చిదానంద స్వరూపుడైన భగవంతునికి సత్, చిత్, ఆనందము ఈ మూడు సహజలక్షణములు. సత్ నిరంతరము ఉండే తత్త్వము. అచలము, నిర్మలము, నిశ్చలము, నిస్వార్థము ఇదియే సత్. చిత్ ఇదే చైతన్యము. దీనినే consciousness అన్నారు. ఈ ఆనందము ఎక్కడనుండి వచ్చింది? ఈ సత్ చిత్ రెండింటి ఏకత్వమే ఆనందము. ఈ మూడింటి ఫలితమే ఆనందము. ప్రతి మానవుడు పుట్టినది మొదలు గిట్టునంత వరకు ఆనందమును అభిలషిస్తున్నాడు. విద్యార్థులు తమ క్లాసులో పాసుకావాలని ఆనందమును అనుభవించాలని ఆశిస్తున్నారు. కానీ పాస్ అయిన తక్షణమే ఆనందము అనుభవిస్తున్నారు. అంత మాత్రములో ఈ ఆనందము శాశ్వతము కావటం లేదు. తిరిగి ఉన్నత స్థాయికి పోవాలని ఆశిస్తున్నాడు. అందులో కూడా ఉన్నతస్థాయి అతనికి లభ్యమైంది. కానీ ఆనందము శాశ్వతముగా లేదు. తదుపరి ఉద్యోగము కావాలని ఆశిస్తున్నాడు ఉద్యోగము చిక్కినప్పుడు కూడా ఆనందము లేదు. ఈ విధముగా జీవితమంతా అనేక కోరికలు కోరుతూ పోతున్నాడు. ఈ కోరికలకు అంత్యమే లేదు. ఆనందమునకు అంత్యము లేదు.

లౌకిక సంబంధమైన ఆనందములు క్షణభంగురములు. 'మా కురు ధన జన యవ్వనగర్వం అరతి నిమేషా కాలా సర్వం' ఇదంతా క్షణములో కాలిపోయేది. క్షణములో ఊడిపోయేది. క్షణములో మారిపోయేది. ఇట్టి దానిని మనము సత్యమని భావించి దీనికి మన జీవితమును అంకితము చేస్తున్నాము. ఇవన్నీ స్వప్న దృశ్యములే. 'కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవు కదా!' జాగ్రత్తలో చూచినవి కలలో ఏ మాత్రము కనిపించటం లేదు. ఇది పగటికల. అది రాత్రికల. రెండు కలలే. రెండింటి యందున్న అహం నేనే. అదే omnipresent. ఇట్టి నిత్యసత్యమైన తత్త్వము మనయందే ఉన్నది గానీ బయట ప్రపంచములో లేదు. వస్తువుల వల్ల లభించే ఆనందము శాశ్వతము కాదు. విషయముల వల్ల లభించే ఆనందము శాశ్వతము కాదు. వ్యక్తుల చేత లభించే ఆనందము శాశ్వతము కాదు. ఇవన్నీ కదలిపోయే మేఘముల వంటివి. కాని ఇట్టి కదలిపోయే మేఘములు సత్యము శాశ్వతమని భావించి మానవుడు దీనిని పొందే నిమిత్తమై అనేక శ్రమలను గురౌతున్నాడు.

ఈ సత్యమును గుర్తించే నిమిత్తమై ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించాలి. అయితే ఎన్ని వేలమందో ఈ ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశిస్తున్నారు. ఎన్నో సాధనలు చేస్తున్నారు. అయితే

13079604

ఎంతమంది ఈ ఆనందమును అనుభవించారు. ఎంతమంది ఈ ఆనందమును పొందినారు. సంవత్సరములు దొర్లిపోతున్నాయి. దేహము పెరిగిపోతున్నాది. కడపటికి కర్తవ్యము గుర్తించకుండా కాయమే కూలిపోతున్నాది. కాని ఫలితమును పొందటం లేదు. దేని కోసం. మన విశ్వాసములు దృఢమైనవిగా లేకపోవటమే మూలకారణము. ఈ విశ్వాసము స్థిరముగా ఉండినప్పుడే దాని ఫలము కూడా స్థిరముగా ఉంటుంది. Ladder కు రెండు ప్రధాన స్థానములని చెప్పాను. క్రింద భూమిని ఆధారము చేసుకున్నదే ప్రేమ. పైన మిద్దెను ఆధారము చేసుకొన్నదే విశ్వాసము. ఈ ప్రేమ విశ్వాసములు రెండు చేరినప్పుడే ladderను ఉపయోగించి పైకి చేరవచ్చు. ఈనాడు ప్రేమ ఉంటే విశ్వాసము లేదు. విశ్వాసముంటే ప్రేమ లేదు. కేవలము విశ్వాసము మాత్రమే చాలదు ప్రేమ ఉండాలి. ఈ రెండింటి సంబంధ బాంధవ్యము పాజిటివ్, నెగిటివ్ వంటిది.

ఏమిలేని బుఱ్ఱలోన ఏమైనా నింపవచ్చు
ఏమేమో నిండియున్న తలబుఱ్ఱది ఖాళియగునా
తలబుఱ్ఱది ఖాళీ కాక ఇల సుకృతంబు నింపనగునా!

మనయందున్న నెగిటివ్ భావములు మనం దూరం చేసుకోవాలి.

ఏనాటికైనా ఈ జగత్తు వదలక తప్పదు. ఈ కాయము శాశ్వతము కాదు. మనము చేసే సర్వకర్మలందు ఫలితము శాశ్వతము కాదు. అన్ని కదలిపోయే మేఘములే. ఇలాంటి మేఘముల నిమిత్తమై మనము ఎందుకింత శ్రమ పడటం. నిత్యసత్యమైన దైవత్వమునకు మనం ప్రాకులాడటం లేదు. భుక్తి కోసం చదివే చదువులు శ్రద్ధగా చదువుతున్నారు. కాని ముక్తి కోసం చదివే చదువులపై శ్రద్ధ చూపటం లేదు. ఈ చదువులు ఏనిమిత్తమై? చదువులన్ని లోకసంబంధమైన స్థానమును గౌరవమును అందించవచ్చును. కాని ప్రాకృత జీవితములో మనం నిలబెట్టుకోవలసినది రెండే రెండు. సత్యము, కీర్తి.

అస్థిరం జీవనం లోకే అస్థిరం యవ్వనం ధనం.
అస్థిరం దారా పుత్రాది సత్యం కీర్తి ద్వయం స్థిరం.

కీర్తిని మనం సాధించాలి. కీర్తి దేని వల్ల లభ్యమవుతుంది. సత్యమార్గము వలనే కీర్తి లభ్యమవుతుంది. మరి ఏ ఇతర మార్గమందు కీర్తి లభ్యము కాదు. ఈ కీర్తి ఎక్కడ నుండి వస్తుంది? సత్యం. ఇదే truth is God. సత్యమే దైవస్వరూపము. సత్యమే సర్వత్ర ఉన్నది. సత్యమే మన ఆధారము

సత్యమే మన ప్రాణము. కనుక ప్రాచీన సంస్కృతి యందు 'సత్యం వద ధర్మం చర'. ఈ రెండింటిని మనం ఆధారము చేసుకొని జీవితము గడుపుతూ రావాలి. ఈ ప్రాకృతమైన, లౌకికమైన జగత్తునందు మనము కీర్తిని సంపాయించవలెనన్న మన చర్యలు సరియైనవిగా ఉండాలి. ధనకనక వస్తువాహనాదులున్నంతవరకు లోకము మనలను గౌరవిస్తుంది. ఎవరిని గౌరవిస్తున్నాది? నీవు భ్రమిస్తున్నావు నిన్ను గౌరవిస్తున్నారని. కాదు కాదు నీదగ్గర నున్న ధనమును చూచి గౌరవిస్తున్నారు. నీకున్న పదవిని బట్టి గౌరవిస్తున్నారు. నకున్న జన బలము చూచి గౌరవిస్తున్నారు. నీ బుద్ధి బలము చూచి గౌరవిస్తున్నారు. గుణ బలము చూచి కాదు గౌరవించటము. గుణమే సరైన కీర్తి. వ్యక్తిగత గుణము. సామాజిక సంబంధమైన గుణము. వ్యక్తిగతమైన గుణము మనయందు లేనప్పుడు సామాజికమైన గుణము ఏలాగా సంపాయించగలవు? ఈ సామాజిక గుణములు సంపాయించక national character ఎట్లా సంపాయించగలవు? ఆ national character చరిత్ర. రామ చరిత్ర, కృష్ణ చరిత్ర. ఇలాంటివి చరిత్రలుగా రూపొందినాయి. కేవలము మన చరిత్రలు మనం వ్రాసుకుంటే అవి చరిత్రలని చెప్పటానికి వీలు లేదు. అది మహా అవమానము. HIS STORY is HISTORY. దైవము యొక్క గుణగణములను వర్ణించేదే story. అతని ఆదర్శవంతమైన గుణముతో మన story. ఇట్టి చరిత్రలు మనం అభివృద్ధి పరచుకోవాలి. చరిత్రాత్ముడు కావాలిగాని జీవాత్ముడు కాకూడదు. కదలిపోయే మేఘములు వంటి అశాశ్వతము అనిత్యము అయిన కీర్తుల గురించి మనము ప్రాకులాడ కూడదు. నీ ఆత్మ తృప్తి నిమిత్తమై నీవు ప్రాకులాడాలి. ఎంతమంది జగత్తులో విద్యావంతులు లేరు. ఎంతమంది జగత్తులో మేధావంతులు లేరు. ఏకత్వమును అనేకత్వముగా విభజించే మేధావులున్నారుగాని అనేకత్వములో నున్న ఏకత్వాన్ని సాధించే మేధావులు కనిపించటం లేదు. ఏకత్వమును అనేకత్వముగా విభజించేవాడు మేధావి. అనేకత్వములోని ఏకత్వము విశ్వసించేవాడే చారిత్రకుడు. అలాంటి ఏకత్వము మనం గుర్తించాలి. దేహముల యొక్క రూప నామములు వేరైనా ఉండవచ్చు. కాని అందరియందు సత్యమనే దైవత్వము ఒక్కటే ఉంటున్నాది.

ఇట్టి సత్యమును మనం ఏవిధంగా మనం సాధించాలి. సత్యము గురువులవల్ల బోధింపబడేది కాదు. లేక గ్రంథముల వల్ల కాదు. మార్కెట్టులో కొనేది కాదు. స్నేహితులు గిఫ్టుగా ఇచ్చేది కాదు. నీవు ఆచరణలో సాధించాలి. నిత్య జీవితములో సత్యముపై లక్ష్యము నుంచుకోవాలి. అదే మన నిజమైన మానవత్వము. త్రికరణశుద్ధితో కూడినదే మానవత్వము. తలంపు, మాట, చేత

ఈ మూడింటి ఏకత్వము కావాలి. ఎంతమంది ఈ విధంగా త్రికరణ శుద్ధితో ఉన్నారిప్పుడు. ఎంత మంది ఈ ఏకత్వము సాధిస్తున్నారు. సంవత్సరముల కొలది సాధనలు చేస్తున్నారు. జగత్తులో వచ్చిన అన్ని ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతూనే ఉన్నారు. రామాయణము పారాయణ చేస్తున్నారు. భగవద్గీత భాగవతము పారాయణ చేస్తున్నారు. ఎన్ని చేసి ఏమి ప్రయోజనం. ఏ కొంచెమైనా సాధిస్తున్నామా? నీవు హృదయముపై చేయిపెట్టుకొని చూడు. అదే సత్యము బోధిస్తుంది. ఎన్ని దినములు ఈ విధముగా జీవించి ప్రయోజనం ఏమిటి? మన హృదయమే మనకు సాక్షిగా ఉంటున్నది. ఇంక సాధనలు చేసి ప్రయోజనం ఏమిటి? సమావేశములో పాల్గొని ప్రయోజనము ఏమిటి? పారాయణము చేసి ప్రయోజనం ఏమిటి? ప్రార్థనలు చేసి ప్రయోజనం ఏమిటి? ఇవన్నీ గాలికి పోయే మేఘాలవలె ఉంటున్నాయి. అది కాదు మనం సాధించవలసింది. సత్యనిత్యము ఎల్లా అనేది నీ హృదయము నుండి రావాలి. ఈ నాడు మనము చేసే ప్రతి కార్యము కృత్రిమముగా రూపొందుతున్నది.

విద్యార్థులారా! మనం heartful గా కావాలి. ఏ కార్యము చేసినా హృదయపూర్వకముగా చేయాలి. art is outside. heart is inside. heart ను follow చేయి. అంతేగాని బయట సంబంధమైన ప్రజలను మనం follow చేస్తే ప్రయోజనం లేదు. తలలు వేరువేరు. తలంపులు వేరు వేరు. కర్మలు వేరు వేరు. ఫలములు వేరు వేరు. ఎందుకు ఇమిటేషను చేస్తావు? నీ హృదయమును నీవు అనుసరించు. Imitation is human creation is Divine. ఆ creation నీ హృదయము నుండి ఆవిర్భవించాలి. ఎన్ని విధములైన సంశయములున్నప్పటికిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగుతూ వస్తుంది. కారణము ఏమిటి? అదే సత్యస్వరూపము. సత్యమనే vibration లో మనం మునిగి పోవాలి. ఈ vibration సర్వత్ర ఉంటున్నది. మనకు కనిపించటం లేదు కనుక విశ్వసించటం లేదు. మన చుట్టూ గాలి ఉంది. కాని మన కంటికి కనిపించటం లేదు. విశ్వసించలేక పోతున్నామా? అట్లే దివ్యమైన vibration మన చుట్టూ ఉంది. In you around you. అట్టి దివ్యమైన ఆత్మతత్త్వము మనం కొంతైనా గుర్తించాలి. చాలామంది సాధనలు చేస్తున్నారు. మహానీయుల యొక్క చరిత్రలు సమావేశములలో వింటున్నారు. ఎన్ని మనం హృదయములో నింపుకుంటున్నాము. నింపుకోటం లేదు. తిన్నది బయటకు పోయినట్లుగా, పీల్చుకున్న గాలి తిరిగి బయటకు విడిచినట్లుగా విన్న విషయములు కూడా బయటకు వదిలివేస్తున్నారు. వదలవలసినవి ప్రాకృతమైనవిగాని దివ్యమైనవి కాదు. ఈనాడు లోకములో ఏ విధ

13079607

మైన సాధనలు చేసినా కించిత్తైనా ఆనందము లభ్యము కావటం లేదు. ఈ లౌకిక సంపాదనలన్ని ఎవ్వడికక్కడ వదలిపెట్టి పోవలసిందే. నీవెంట జంటకంటు ఇంటు ఉండి నిన్ను కాపాడుతూ వచ్చేది ఒక్కటే అదే సత్యము. కనుక అట్టి పవిత్రమైన మార్గములో మనం ప్రవేశించాలి. కేవలం రాం రాం రాం అని స్మరించినంత మాత్రమున ఉపయోగము లేదు. కేవలం పెదవుల నుండి వస్తున్నది గాని హృదయము నుండి రావటం లేదు. టేప్ రికార్డు పాడుతూనే ఉంటుంది. కాని దాని వల్ల ఎంత ఫలితము వస్తున్నది? గ్రామఫోను ప్లేటు పాడుతున్నది. దాని వల్ల ఎంత ఫలము వస్తున్నది. అది కరెంటుకు కనెక్షను చేయాలి. అప్పుడు పాట సరైన రీతిగా వస్తుంది. అకరెంటే will power. దానినే free will అన్నారు. ఈ free will ఒక్క భగవంతునికే ఉంది వేరు ఎవ్వరికి లేదు. అందరు చెప్పు వచ్చే free will.లు. పదములు ఉచ్చరిస్తున్నారు గాని ఆ free will నీలో లేదు. నీయందున్న will power నీవు కోల్పోతున్నావు. ఈ free will ఎక్కడ పెట్టుకోగలవు? ఏ రీతిగా కాపాడుకోగలవు దాన్ని కాపాడుకొనే ప్రదేశము నీ హృదయమే. కేవలము physical heart కాదు. spiritual heart. ఎక్కడికి పోయినా మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఏ రీతిగా జరుగుతున్నాయో ఆ చింతన ఆ రీతిగా ఉండాలి. మనము నిద్రపోతున్నా మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుగుతూనే ఉన్నాయి. మనము పనులు చేస్తున్నా ఉచ్ఛ్వాస నిశ్వాసములు సహజంగా జరిగిపోతున్నాయి. ఎవరితోనైనా పోట్లాడుతున్నా మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు సహజంగా జరుగుతున్నాయి. ఈ ప్రాకృతమైన దానికి ఏ మాత్రము అడ్డురాదు. అదే విధంగా ఏ మార్గములోనైనా అది శాశ్వతంగా ఉంటుంది. అట్టి సత్యనిత్యమైన దానిని మనము అనుసరించటానికి ప్రయత్నం చేయాలి.

విద్యార్థులారా! మనము పెంచుకోవలసినవి సత్యము, ధర్మము. కేవలము లోకమును సంరక్షించుటకోసము కాదు. లోకమును సంరక్షించువాడు ఎవడు లేడు. ఇక్కడ. సత్యధర్మములే లోకమును సంరక్షిస్తాయి. నీవు రక్షించవలసినది సత్యధర్మములనే. నీవు ఆ రెండింటిని సంరక్షించినప్పుడు ఆ రెండే దేశమును రక్షిస్తాయి. కనుక సత్యధర్మములను మనం ప్రాణసమానంగా చూసుకోవాలి. ధర్మో రక్షతి రక్షితః, ధర్మ ఏవ హతో హంతి' ఈనాడు ధర్మమంటే ఏమిటో తెలియుటం లేదు. సత్యమంటే ఏమిటో తెలియుటం లేదు. సత్యము త్రికాల బాధ్యము. అప్పటికప్పుడు మారేదికాదు అదంతా నిజము. ఇది ప్రాకృతమైన సత్యము. ఇది మారుతూ ఉంటుంది. తెల్లవారి యోగము, మధ్యాహ్నము రోగము, రాత్రి భోగము ఈ విధంగా మారుతుంటే ఎంత కాలమని. రామాయణమునకు

కామము ప్రధానమన్నారు. అదే రావణుని పతనమునకు మూలకారణము. భాగవతమునను క్రోధమే కారణమన్నారు. హిరణ్యకశిపుడు భగవంతునిపై క్రోధము చేత భగవంతుని చే హింసింపబడ్డాడు భారతములో లోభత్వము. రామాయణము కామము, భాగవతము క్రోధము, భాగవతము లోభము. ఒక్కొక్క దాని యందు ఒక్కొక్క వ్యక్తి ఉన్నప్పుడే ఇంత పతనమై పోయింది దేశము. ఈ నాడు ఈ మూడు గుణములు ఒకే వ్యక్తి యందుంటున్నాయి. ఇంక మానవుని ఎంత పతనము చేస్తుంది. పవిత్రమైన దివ్యత్వమునకు ఆటంకములు ఈ మూడే. నరక ద్వారములు ఈ మూడు అని వేదము బోధించింది. రామాయణ, భారత, భాగవతములందు ఒక్కొక్క గుణము మాత్రమే ఉంటూ వచ్చింది. ఈ నాటి మానవుని యందు మూడు గుణములు చేరినాయి. కామము, క్రోధము, లోభము. వీనికి ఏ గతి పట్టాలి. రూపునామములు లేకుండా శిథిలమై పోతాడు. కనుక మొట్టమొదట కామ క్రోధ లోభములను సంహరించటానికి ప్రయత్నించాలి. వాటిని ఏనాడు మనము దూరము గావించుకొందుమో ఆనాడే మనము జీవించినట్లవుతుంది. అప్పుడే మనకు కీర్తిప్రతిష్ఠలు ప్రాప్తిస్తాయి. లేకపోతే అపకీర్తి, అప్రతిష్ఠల పాలౌతాము. చూడటానికి మేడిపండు వలె ఉంటున్నాము. పొట్ట విప్పి చూడ పురుగులుండు. మనము చూడటానికి ఆనందముగా ఉన్నట్లు నటిస్తున్నాము. నవ్వుతున్నాము. అంతా సినిమా యాక్టింగులై పోతున్నాయి. మన హృదయము నుండి రావాలి ఆనందము. అదే నీకు తృప్తి. అదే నిజమైన ఆనందము. అదే నిజమైన సంపత్తి. Who is the poorest man in the world? He who has more desires. Who is the richest man in the world! He who has much satisfaction. తృప్తి కలిగినవాడే నిజమైన శాంతి పరుడు. ఎవరికుంది తృప్తి. తృప్తియే లేదు. తృష్ణ ఉంటున్నది గాని తృప్తి లేదు. తృష్ణ అనగా నిముష నిముషమునకు కోరికలు అభివృద్ధి కావటం. ఈ తృష్ణను మనం అనుసరించ వద్దు. కృష్ణను అనుసరించండి. కృష్ణుని అనుసరించినప్పుడు అన్ని లభ్యమవుతాయి. భగవన్నామాన్ని మనం స్మరించాలి. భగవంతుని ఆజ్ఞను మనం ఆచరించాలి. ఎన్ని ఆచరిస్తున్నాము మనము. రామాయణములో పితృవాక్య పరిపాలన మన్నారు. కానీ ఎంత మంది పితృవాక్య పరిపాలన ఆచరిస్తున్నారు. రాముడు సత్యస్వరూపుడు. మనము అంతా అసత్యమే. సంవత్సరమునకు ఒక్కమారి సత్యన్నారాయణ వ్రతము చేస్తున్నాము. కాదు. సతతం సత్యం. అట్టి సత్యమును మనము పాటించటానికి కొంచెమైనా మనము ప్రయత్నం చేయాలి. కాని మనము ఆచరించటం లేదు. నోరెత్తితే అసత్యము. ఏమి చెప్పినా అసత్యమే. సత్యమంటే ఏమిటో గుర్తించటానికే వీలుకాకుండా ఉంది.

విద్యార్థులారా! మీరు ఎలాంటి పరిస్థితులందైనా, ప్రాణం పోయే పరిస్థితి వచ్చినా సత్యమును మాత్రం వదలకండి. సత్యమే నీ జంట, వెంట, ఇంట ఉండి కాపాడుతుంది. హరిశ్చంద్రుని రూపము సత్యహరిశ్చంద్రునిగా మార్చివేసింది. ఎన్ని కష్టములకు గురయ్యాడు. ఎన్ని బాధలకు గురయ్యాడు. ఆలు బిడ్డలను అమ్ముకున్నాడు. కాటికాపరిగా తయారయ్యాడు. కాని జంక లేదు. కృంగలేదు. సత్యమును వదలక ఉంటున్నాడు. కట్టకడపటికి దైవమే లొంగిపోయాడు. అప్పుడు దైవమే ప్రత్యక్షమై కోల్పోయిన సర్వస్వమును అందించి నీవు సత్యహరిశ్చంద్రుడు అని బిరుదు అందించాడు. ప్రతి మానవుడు అమృత పుత్రుడే. నీవు అనృత పుత్రుడు కాదు. దైవము సత్య స్వరూపుడు. అందరు దైవమునుండి ఆవిర్భవించినవారే. అన్ని బుడగలు నీటినుండి వచ్చినవే. ప్రతి మానవుడు సచ్చిదానంద సాగరమునుండి ఆవిర్భవించినవారే. అందరు సచ్చిదానంద స్వరూపులే. ఆ సత్యమును గుర్తించి ప్రతి మానవుడు నేను సచ్చిదానందుడను అనే భావము ధృఢముగా నాటుకొని పోతే మనకు ఎంత ఆనందము. కేవలం కృత్రిమంగా భావించకూడదు. హృదయపూర్వకంగా భావించాలి. నేను సచ్చిదానంద స్వరూపుడనే. దేహము కూలిపోతుంది. మనసు రాలిపోతుంది. బుద్ధి చలిస్తుంది. భావాలు కదలిపోతున్నాయి మేఘాలవలె. నేను ఎప్పుడు ఉంటున్నవాడనే. నేను కదిలే వాడను కాను. జారే వాడను కాదు. ఊగే వాడను కాదు. ఏకత్వముగా ఉండేవాడను. ఇలాంటి భావము మనం ధృఢం చేసుకోవాలి. ఆ భావము మనకు ఎప్పుడొస్తుందో అప్పుడే సాక్షాత్కారమై పోతుంది. కాని ఆ భావముపైన కూడా విశ్వాసము లేదు. ఎట్లా వస్తుంది మనకు. అందువలనే మొట్టమొదట faith in you. faith in god. ఈ రెండు ఉంటే ఎంతైనా మనము సాధించవచ్చు. దేనికి నీవు భయపడవద్దు. దేనికి భయపడాలి. సత్యము నాలో ఉంటున్నది. సత్యము దేనికి భయపడదు. అందువలనే సత్యమేవ జయతే. ఈ సత్యము మనము సాధించాలంటే ప్రేమతోనే మనం సాధించాలి. నా ప్రసంగములో ఏమి లేక పోయినా సత్యము ప్రేమ ఈ రెండింటితో ప్రారంభమవుతుంది. ఈ రెండింటితోనే అంత్యమవుతుంది. ఈ రెండు లేక నేను ప్రసంగము చేయను. ఎందుకనగా అందరి ప్రాణములు ఈ రెండే. ఒకటి ఉచ్ఛ్వాసము రెండవది నిశ్వాసము. ఈ రెండు లేక జీవితము ఏ విధంగా ఉంటుంది. కనుక సో-సత్యము. హం-ప్రేమ ఈ సత్యము ప్రేమ ఉన్నప్పుడే మన జీవితము.

విద్యార్థులారా! ఈ లేత వయస్సునందే సత్యము ప్రేమ మీరు అభివృద్ధి గావించు

కోవాలి. సత్యమును, ప్రేమను అపమార్గములో ప్రవేశపెట్టకండి. నీ స్వార్థము, స్వప్రయోజనము చేరి పోవటం చేత సత్యము కూడా మారిపోతున్నాది. ఆనాడు ఎంతో పవిత్రమైన వాతావరణము కనుక సత్య హరిశ్చంద్రుడు విజయమును సాధిస్తూ వచ్చాడు. ఎవరు అతనిని మార్చలేకపోయారు. ఈనాడు కలియుగములో ఆ హరిశ్చంద్రుడే ఉంటే అతని చేత కూడా అసత్యము చెప్పిస్తారు. కలి ప్రభావము ఇంత ఇదిగా ఉంటున్నాది. ఎంతో మంది సత్యము చెప్పాలని ప్రతిజ్ఞ చేసుకుంటారు. కాని బయటకు వస్తూనే అసత్యమై పోతుంది. మనము ఈ కలి ప్రభావమునకు ఏమాత్రము లొంగకూడదు. మన ఆనందములోనే సత్యమును పొంగింప చేయాలి. ఏ సాధనలు చేయక పోయినా ఫరవాలేదు. సత్యమును ప్రేమను మీరు అభివృద్ధి పరచుకోండి. సత్యము దగ్గర హింస ఉండదు. ప్రేమ దగ్గర హింస ఉండదు. ధర్మము దగ్గర హింస ఉండదు. శాంతము దగ్గర హింస ఉండదు. ఈ సత్యధర్మశాంతి ప్రేమ అహింసల దగ్గర అహింస పూర్ణముగా ప్రత్యక్షమవుతుంది. ఈనాడు అవి లేకపోవటం చేత ప్రపంచము హింసలో నిండి ఉంటున్నాది. ఇంటిలో హింస బయట హింస, బజారులో హింస, ట్రైనులో హింస ఎక్కడ చూచినా హింసే. 'భయం భయం బ్రతుకు భయం అన్నా బ్రతుకే లోకం పన్నిన వ్యూహం' పద్మవ్యూహమిది. పద్మవ్యూహంలో భయం. అంతా భయమే. ఎక్కడికి పోకుండా ఇంటిలో ఉన్నా భయమే. నడుచుకొని పోదామన్నా భయమే. ఎక్కడ భయము లేనిది? దైవము దగ్గరే అభయము. దైవము దగ్గర భయమునకు అవకాశమే లేదు. మొట్ట మొదట దైవమును మనహృదయములో ప్రతిష్ఠ చేసుకోవాలి. మన హృదయము దైవమును ప్రతిష్ఠ చేసుకోటానికి ఇచ్చిన సోపానమేగాని కేవలం బ్రతికే కొరకు ఇచ్చినది కాదు. హృదయవాసి భగవంతుడు.

విద్యార్థులారా! మీరు ఎలాంటి పరిస్థితియందైనా సత్యము పలకండి. ప్రారంభములో కొంచెం కష్టంగా ఉంటుంది. నిజంగా చెబుతున్నాను సత్యం పలుకుటమే సులభము. సత్యము పలుకుటకు ఏమాత్రము శ్రమ లేదు. అసత్యము చెప్పాలంటే ఎన్నో ప్లానులు వెయ్యాలి. చాలా యోచన చేయాలి. అసత్యమునకు ఎంత శ్రమ ఉంటున్నాది. ఎందుకు అంత శ్రమపడి అసత్యములో పాల్గొంటున్నావు. సులభంగా నీవు సత్యములో పాల్గొను. ఉన్నది ఉన్నట్లు చెప్పటం ఎంత సులభం. కంటికి కనిపించే దానికి ఎందుకు అసత్యము పలకటము. ముంజేతి కంకణమునకు అద్దమెందుకు. నీ కంకణము నీవు సులభంగా చూడవచ్చును. అయితే నీవు నీ కన్నులను చూడలేవు. మూడవ నేత్రమన్నారు. అదే ప్రేమ నేత్రము. సత్యధర్మములలో ఈ ప్రేమ నేత్రము ఉండినప్పుడు

13079611

అన్నింటిని మనం చూడవచ్చును. అందువలనే యోగాభ్యాసములో పూరక, కుంభక, రేచకములుగా భావిస్తూ వచ్చారు. మనము కుడివైపున తీసుకొనే గాలికి ఇళ, ఎడమవైపున పింగళ, భ్రూమధ్య స్థానమే సుషుమ్న. భ్రూ మధ్యములో నీదృష్టిని నిల్పు. అప్పుడే ఎట్టి భావములు రావటానికి అవకాశం ఉండదు. భావము లేని నేత్రమే త్రినేత్రము. భగవంతునికి త్రినేత్రుడని ఎందుకు పేరుపెట్టారు? ప్రతి మానవునికి రెండు నేత్రములుంటున్నాయి. past ని చూడగలడు. present ని చూడగలడు. భవిష్యత్తును చూడలేడు. త్రినేత్ర స్వరూపుడైన భగవంతుడు past, present, future మూడింటిని చూస్తాడు. అందుకే అతనికి త్రినేత్రుడని పేరు. నీవు future చూడలేవు. past లో బొంబాయిలో ఫలాని ఇంటిలో ఉండినాను అంటే నీవు ఆ ఇల్లు చూడవచ్చు. present ని చూడవచ్చు. నీకు రెండు నేత్రములే ఉన్నాయి. భగవంతునికి మూడు నేత్రములున్నాయి. భవిష్యత్తు కూడా చూడగలడు. ఈ విధమైన అంతరార్థములతో కూడినదే భారతీయ వేదాంత సంస్కృతి. భారతీయ సంస్కృతి ఎంత పవిత్రమైనది. ఎంత ఉత్తమమైనది. ఎంత విలువైనది. ఎంత ప్రాణవంతమైనది. ఎంత ఆదర్శవంతమైనది. దీనిని మొట్టమొదట విద్యార్థులు గుర్తించాలి. ఈ సంస్కృతి అంటే వారికే తెలియదు. ఈ సంస్కృతియే మన గమ్యమునకు చేర్చే మార్గము. అదే మన గమ్యము. అదే మన లక్ష్యము. అదే మన దివ్యత్వము అదే మన పవిత్రము. అదే మన చరిత్రము. ఇలాంటి పవిత్రమైన చరిత్రతో కూడిన భారతీయుడు ఎందుకో చరిత్రను పాడు చేసుకుంటున్నాడు. ఆ చరిత్రను నిల్పుకోండి. ప్రేమచేత నిల్పుకోండి.